మంత్రి సబితాఇంద్రారెడ్డి రాజీనామా చేయాలి: దేప భాస్కర్‌రెడ్డి



కొత్తపేట చౌరస్తాలో మంత్రి సబిత దృష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

దిల్‌సుఖ్‌నగర్: పదవ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపేట చౌరస్తాలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటన ప్రకంపనలు మరువక ముందే 10వ తరగతి పేపర్ లీకేజీతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, నల్లెంకి ధనరాజ్ గౌడ్, పార్టీ రామకృష్ణాపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చిక్కుళ్ల శివ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ గుల్షన్, నేతలు బొడ్డుపల్లి మహేందర్, రవీంద, కల్యాణ్ యాదవ్, పగడాల శ్రీశైలం, ఇమ్రాన్ అలీ, అక్బర్, ఇస్మాయిల్, పింటూ, నబీ, సన్నీ, సలీం, విజయ్, సూర్య పాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,విప్లవ్ రెడ్డి, కాళిదాస్, సురేష్, చిలకరాజు సాయిజగదీష్, రాజు, అనుదీప్, సంతోష్ కుమార్, శివ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- విద్యార్థులతో సందడిగా పరీక్షా కేంద్రాలు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, మలక్‌పేట్, సైదాబాద్, సరూర్‌నగర్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు వసతులు కల్పించారు.



సరూర్‌నగర్‌లో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



అబ్దుల్లాపూర్‌మెట్‌లో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థినులు

హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో...

హయత్‌నగర్: హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో 6522 మందికి గాను 6503 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ హీర్యానాయక్ తెలిపారు. మొదటి రోజు పరీక్ష ఎలాంటి ఆటంకం లేకుండా జరిగిందని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని ఆయన పేర్కొన్నారు.

6 నుంచి 'పల్లెపల్లెకూ ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ'

మలక్‌పేట: పల్లె పల్లెకూ ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ఆధ్వర్యంలో మలక్‌పేట సలీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సురేందర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహించే కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని బీసీల సంక్షమానికి ప్రధాని మోడీ చేస్తున్న కృషి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెండం లక్ష్మణ్, కార్పొరేటర్‌లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణరవీంద్‌రెడ్డి, గంగిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఆదాయం రూ. 10.70 కోట్లు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆదాయం టార్గెట్ రీచ్ కావడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. 2022–23వ సంవత్సర మార్కెట్ ఆదాయం మార్చి 31వ తేదీ వరకు రూ. 10 కోట్ల 70 లక్షలు సమకూర్చామని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఆదాయం సమకూరడంలో రైతులు, వ్యాపారుల సహకారం ఎంతో ఉందన్నారు. మార్కెట్ అధికారుల కృషి కూడా అభినందనీయమని కొనియాడారు. ఇందుకు మార్కెట్ డైరెక్టర్ అధికారులు అందరినీ ప్రశంసించారని తెలిపారు. 2023–2024వ సంవత్సరానికి గానూ మార్కెట్ ఆదాయం రూ. 12 కోట్ల టార్గెట్ ఉందని... దాన్ని సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో గ్రేడ్–3 సెక్రటరీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న ఆర్‌కేపురంలో వీర హనుమాన్ విజయయాత్ర

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలో ఈ నెల 6వ తేదీన జరిగే వీర హనుమాన్ విజయయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆర్‌కేపురం పార్టీ కార్యాలయంలో వీర హనుమాన్ విజయ యాత్రకు సంబంధించి రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ధీరజ్‌రెడ్డి, రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడు పిట్ట ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, వెంకట్ రెడ్డి, బీజేపీ నాయకులు వెంకటేష్ యాదవ్,రమాకాంత్, రమేష్ గౌడ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

21న ది భావన రిషి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

చైతన్యపురి: గడ్డిఅన్నారం కృష్ణవేణి నగర్ కాలనీలోని ది భావన రిషి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎస్.చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 11 మంది కమిటీ సభ్యులను ఎనుకోనున్నారన్నారు. ఈ నెల 10 నుంచి 12 వరకు నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందన్నారు. 13న స్క్రూటినీ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. 14న సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ, 21న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే రోజు ఎన్నికల తరువాత కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారి వివరించారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



లింగోజిగూడ: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసే విద్యార్థులకు మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి బాటిళ్లు, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చేవూరి శంకరయ్య, సభ్యులు సునీత, మక్బూల్, గంగం రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ థీమ్ పార్కు పనుల పరిశీలన



థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: అత్యాధునిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఉమెన్ థీమ్ పార్కును నిర్మిస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సచివాలయనగర్ నర్సరీ పార్కులో నిర్మిస్తున్న ఉమెన్ థీమ్ పార్కును సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో నియోజవర్గాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. ఉమెన్ థీమ్ పార్కు నిర్మాణానికి రూ. 1.5 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. థీమ్ పార్కు అత్యాధునిక పరికరాలు, వసతులతో రూపుదిద్దుకుంటోందన్నారు. ఆకర్షణీయమైన మొక్కలను పార్కులో ఏర్పాటు చేస్తునామని అన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టాయిలెట్స్, సమావేశాలు, కిట్టీ పార్టీలు జరుపుకొనేందుకు విశాలమైన స్థలం, కౌన్సిలింగ్ రూం, చిన్నారులకు ఆట స్థలాలను ఏర్పాటు చేస్తామన్నారు. బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి, పోగుల రాంబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు

సైదాబాద్: వేసవి ప్రారంభమైనందున డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పూసలబస్తీ, సాయిగంగా కాలనీల్లో కార్పొరేటర్ పర్యటించారు. బస్తీల్లో తాగునీటి సరఫరా సరిగా జరగనందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి పైప్‌లైన్‌లకు అదనపు వాల్వులు అమర్చి సమస్య పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సత్వరమే సంబంధిత అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ స్పష్టం చేశారు. వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, నేతలు మనోహర్, లింగం గౌడ్, జగన్, భాను తదితరులు పాల్గొన్నారు.

'సంగీత స్వర రాగ కరదీపిక' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వంశీరామరాజు తదితరులు

వనస్థలిపురం: సంగీత పరమైన ఎన్నో విషయాలు 'సంగీత స్వర రాగ కరదీపిక' అనే పుస్తకంలో ఉన్నాయని, కొత్తగా కీ బోర్డు నేర్చుకునేవారికి కరదీపిక చాలా ఉపయుక్తంగా ఉంటుందని కళాబ్రహ్మ శిరోమణి డాక్టర్ వంశీరామరాజు అన్నారు. ఆదివారం రాత్రి వనస్థలిపురం శారదానగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కళాభారతి సంస్థ అధ్యక్షుడు కొప్పోలు జగన్నాథరావు సంకలన పరచిన 'సంగీత స్వర రాగ కరదీపిక' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.శివరామప్రసాద్ మాట్లాడుతూ... 121 రాగాల ఆరోహణ, అవరోహణ స్మృతులు కీ బోర్డుపై పలికించే కొత్త ప్రక్రియను జగన్నాథరావు చూపించారని కొనియాడారు. వనస్థలిపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ టి.యాదగిరిరావు, ఎ.లక్ష్మీనరసింహారావు, కె.ఎల్.నర్సింహారావు, సత్యారెడ్డి, హరిప్రసాద్, రఘురామయ్య, అరుణకుమార్, జ్ఞానేశ్వర్, ప్రసన్నాంజనేయులు, రాజేశ్వర్‌రావు, డాక్టర్ ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజాధనం వృథా

- బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



నాగోలులో మూసీ నదిని పరిశీలిస్తున్న సామ రంగారెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు

నాగోలు: మూసీ నది సుందరీకరణ పేరిట రూ. వందల కోట్ల ధనాన్ని వృథా చేస్తూ మూసీ చైర్మన్ సుధీర్‌రెడ్డి జేబులు నింపుకొంటున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. సోమవారం బీజేపీ కార్పొరేటర్లు పవన్ కుమార్, నరసింహ గుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి నాగోలులోని మూసీ నది సుందరీకరణ పనులను రంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు మూసీ నదిలో చాలా ప్రమాదకర స్థాయిలో కాలుష్యం ఉందని నివేదిక ఇచ్చిందని కానీ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో గొప్పలు చెప్పుకున్నారు తప్ప దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన సుధీర్‌రెడ్డికి బహుమతిగా ముఖ్యమంత్రి కేసీఆర్ మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తే దాన్ని అడ్డుపెట్టుకొని అభివృద్ధి పేరుతో దోచుకుతింటున్నారని ఆరోపించారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేయడం మర్చిపోయారని విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల సురేందర్ యాదవ్, మంచి రాజేష్, రాకేష్ యాదవ్, గట్టు మహేష్, కమల్, మైనం రాజేష్, రవిశంకర్, కృష్ణంరాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గరుడ వాహనసేవ



చంచల్‌గూడ: సీతారామ కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ రామాలయం నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై సాయిలాల్‌తోట, చావణి, శాంతినగర్ పురవీధుల్లో ఊరేగించారు. శ్రీరామ భక్త సమాజం వారి ఆధ్వర్యంలో భజన కొనసాగింది. బస్తీవాసులు స్వామికి వారికి మంగళ హారతులతో పూజలు నిర్వహించారు. ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్ యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్, యాట ప్రమోద్, రాహుల్ కిషోర్, రాజ్‌పాల్‌యాదవ్, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 17, దొండ 35.

పెంపుడు కుక్క అదృశ్యంపై ఫిర్యాదు

హయత్‌నగర్: పెంపుడు కుక్క అదృశ్యమైందని ఫిర్యాదు చేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... హయత్‌నగర్ డివిజన్ రంగనాయకులగుట్ట కాలనీ కొంరెడ్డి నరేందర్ పందుల పెంపకం చేపడుతుంటాడు. పందులకు కాపలాగా నాలుగేళ్ల క్రితం జిమ్మి అనే కుక్క పిల్లను పెంచుకున్నాడు. ఎనిమిది నెలల క్రితం కుక్క ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే కొత్తగూడెం గ్రామంలోని మానుపటి వెంకటేష్ ఇంటి వద్ద తమ కుక్క కనిపించిందని, ఆ కుక్కను తనకు ఇవ్వటానికి వారు నిరాకరించారని నరేందర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నియమ నిబంధనలు :

1. వేలంలో పాల్గొనేందుకు కాగోరు బిడ్డర్లు తిరిగి చెల్లించబడే డిపాజిట్ (EMD) ను **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి, హైదరాబాద్** పేరున చెల్లించబడేలా పే-ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. కృతార్థులైన బిడ్డర్ల విషయంలో సదరు డిపాజిట్ సర్దుబాటు చేయబడును. అధీకృత అధికారిచే వేలం అమ్మకం నిర్వహించబడును. కాగోరు బిడ్డర్లు పే-ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా బిడ్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి తేది 04-05-2023 సాయంత్రం 6-00 గంటలలోగా పైన తెలిపిన బ్రాంచి నందు దాఖలు చేయాలి.
2. బయానా కోసం పే-ఆర్డర్/ డి.డి. లేకుండా దాఖలు చేసిన బిడ్ ఖచ్చితంగా తిరస్కరించబడును.
3. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను / ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వేలం అమ్మకమును వాయిదా వేయుటకు / పోస్ట్‌ఫోన్ చేయుటకు, / రద్దు చేయుటకు అధీకృత అధికారికి హక్కు కలదు. బిడ్లు తిరస్కరించబడితే, ప్రైవేటు ఒప్పందం ద్వారా ఆస్తుల అమ్మకం కోసం ఏ బిడ్డర్లు దారులతోనైనా లేదా కాగోరు బిడ్డర్లతో నైనా లేదా ఇతర పార్టీలతోనైనా అధీకృత అధికారి సంప్రదింపులు జరిపి ఆస్తిని అమ్మకము చేయవచ్చును.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తిని విక్రయించబడును.
5. పైన పేర్కొన్న ఆస్తిని తెలియజేసిన రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
6. బిడ్/ ఆఫరు అధీకృత అధికారిచే అంగీకరించబడితే, బిడ్‌లో అత్యధిక అమ్మకం ధర ఆఫర్ చేసిన కృతార్థులైన బిడ్డరు అమ్మకం ధరలో బిడ్ మొత్తం (బయానాతో సహా) లో 25% మొత్తమును వెంటనే అదే రోజున అధీకృత అధికారికి చెల్లించాలి. ఆ విధంగా చేయడంలో విఫలమైతే, బయానా మొత్తం తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును.
7. కృతార్థులైన బిడ్డరు అమ్మకం నిర్ధారించబడిన 15వ రోజులోగా లేదా అంతకంటే ముందుగా బిడ్ మొత్తంలో మిగిలిన 75% మొత్తమును పే-ఆర్డర్/డిడి/ క్యాష్ రూపములో **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి, హైదరాబాద్** లో చెల్లించవచ్చును. బిడ్ మొత్తంలోని మిగిలిన 75% మొత్తం నిర్ణీత గడువులోగా అనగా అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి 15 రోజులలోగా చెల్లింపు జరపకపోతే డిపాజిట్ మొత్తం (బయానాతో సహా బిడ్ మొత్తంలో 25%) తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును. మరియు డిఫాల్ట్ అయిన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తి లేదా అందులోని ఏ భాగం పైన నైనా అన్ని క్లెయిమ్‌లు కోల్పోతారు.
8. బ్యాంక్‌చే అమ్మకం నిర్ధారించబడిన మీదట మరియు చెల్లింపు నిబంధనలు పాటించినట్లయితే, అమ్మకం అధికారాలు వినియోగించుకునే అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ చట్టం 2002 క్రింద గల నియమాల ప్రకారం కొనుగోలుదారుని పేరున అమ్మకపు సర్టిఫికెట్ జారీ చేస్తారు.
9. ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే మరియు ఉన్నవి ఉన్నట్లుగానే" స్థితిలో మరియు సెక్యూరిటైజేషన్ చట్టం 2002లో నిర్దేశించిన నిబంధనలకు లోబడి విక్రయించబడును.
10. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు వేలం అమ్మకం కోసం ఉంచబడిన ఆస్తిని బ్రాంచి పనిచేయబడిన సమయంలో బ్రాంచి మేనేజర్ అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును. వాటి కోసం వారు బ్రాంచి మేనేజర్ **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి, హైదరాబాద్** వారిని సంప్రదించవచ్చును.
11. కృతార్థులైన బిడ్డరు వర్తించు విధంగా / చెల్లించతగు కన్వేయన్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, చట్టబద్ధమైన బకాయిలు మొ॥ చెల్లించబడు అన్ని చార్జీలను ప్రత్యేకంగా బిడ్డరు భరించవలెను.
12. బ్యాంక్ నిర్ధారణకు లోబడి అమ్మకం/ వేలం ఉంటుంది.
13. వేలం వేయబడిన ఆస్తికి సంబంధించి ఏదైనా చార్జ్, లీన్, తాకట్టు, రుణభారాలు, ఆస్తిపన్ను లేదా ప్రభుత్వానికి లేదా ఏ సంస్థకైనా ఏమైనా ఇతర బకాయిలు ఉంటే అధీకృత అధికారి బాధ్యత వహించరు.
14. వారి బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం నిర్వహిస్తూ పైన పేర్కొన్న రుణానకు సంబంధించిన రుణగ్రహీత / గ్యారంటారుకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
15. వేలం ప్రక్రియ ద్వారా ఆస్తుల అమ్మకం సంపూర్ణం కాకపోతే SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఒప్పందం ద్వారా బ్యాంక్ అమ్మకమునకు వర్తింపజేస్తుంది.
16. అధీకృత అధికారిచే తెలియజేయబడిన వివరాలు అతని పరిజ్ఞానం మేరకు మరియు రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఏదైనా పొరపాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి సంబంధించి అతను బాధ్యత వహించదు.
17. సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో సహా అన్ని బకాయిలు ఒకవేళ ఆస్తి అమ్మకమునకు నిర్ణయించిన తేదీలోగా ఏ సమయంలోనైనా పై పేరుగల రుణగ్రహీత / సహ రుణగ్రహీత / లీగల్ హెయిర్స్ తీర్చినట్లయితే అప్పుడు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తి విక్రయించబడదు. మరియు కాగోరు బిడ్డర్ల నుండి స్వీకరించబడే అన్ని బిడ్లు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పక్షాన ఎటువంటి బాధ్యత / క్లెయిమ్ లేకుండా వారికి వాపసు ఇవ్వబడును.
18. ఆఫర్ ఫారంతో సహా కాగోరు బిడ్డరు ఆదాయ పన్ను శాఖచే జారీచేయబడిన PAN కార్డ్ కాపీ మరియు అతని / ఆమె గుర్తింపు రుజువు మరియు నివాస రుజువు అంటే ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎలక్షన్ కమిషన్ కార్డ్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥ వారి కాపీ కూడా జతచేయాలి.

తేది : 03-04-2023, హైదరాబాద్ — అధీకృత అధికారి, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి